
# ఉమ్మడి లోగిలి

కథ

ప్రభా సుబ్బారావు



బెంగుళూరు
2-1-2006

ప్రియమైన శాంతీ,

నీ లెటరు అంది రెండు గంటలయ్యింది. చదువుతుంటే మనస్సంతా ఏదోలా అయిపోయింది. మీ అన్నయ్యగారు వాకింగ్‌కి వెళ్ళారు. రోజూ ఇద్దరమూ కలిసే వెళ్తాము. ఈరోజు నీకు లెటరు వెంటనే వ్రాయాలన్పించి ఒక్కరినే వెళ్లమన్నాను.

రఘు ఫోన్లు చేస్తున్నాడు. కోడలు, పిల్లలు కులాసాగా ఉన్నారట. ఇంక స్నేహ, సింగపూర్‌లో ఫ్లాట్ కొనుక్కుంటున్నామని ఫోన్ చేసింది. పిల్లలు ఆస్తులు కొనుక్కుంటున్నారని ఒక పక్క సంతోషంగా ఉన్నా, ఇంక ఎప్పటికీ పిల్లలకి మనం, మనకి పిల్లలు చుట్టం చూపుగా అయిపోతున్నామన్న ఫీలింగ్... ఏదో చెప్పలేని ఆవేదన. ఒక్కోరోజు అన్నయ్యగారు, నేనూ ఇదే విషయం చర్చించుకొంటూ మనస్సు పాడు చేసుకోవడం, తరువాత ఒకరిని ఒకరు ఓదార్చుకోవడం.

పెద్ద ఇల్లు కట్టుకున్నామని కొత్తలో తెగ మురిసిపోయాం. పిల్లలొస్తే ఇబ్బంది లేకుండా ఉంటుందని అన్ని సౌకర్యాలతో బెడ్‌రూమ్సు. మనుమలకు టబ్ స్నానాలు అలవాటని బాత్‌రూమ్స్‌లో పెద్ద పెద్ద టబ్స్, లాన్‌లో ఉయ్యాలా.. ఇంత పెద్దిల్లు అనవసరంగా కట్టామేమో అన్పిస్తుంది. పిల్లలు రెండు సంవత్సరాలకోసారి వచ్చి ముచ్చటగా మూడు వారాలుండి, మురిపించి వెళ్ళిపోతారు. వాళ్లకి విడిగా బెడ్‌రూమ్స్ ఉన్నా, అందరమూ ఒక్క చోటే కబుర్లు చెప్పుకుంటూ పడుకోవచ్చు అంటూ హాల్లో వరుసగా పక్కలు వేస్తారు. అద్దె ఇంట్లో ఉన్నప్పుడు వరుస గదులు, పిల్లలు వచ్చేపోయే బంధువర్గంతో ప్రైవసీ లేదని కొట్టుకుపోయే వాళ్లం. ఇప్పుడు దొరికిన ఈ అధిక ప్రైవసీతో బోర్ కొడుతుంది. శాంతీ, ఈ జీవితం ఇంక ఇంతేనా? నిరాశ, నిస్పృహ... వీటి నుండి బయట పడే మార్గమే లేదా?

శాంతీ, ఎప్పటికప్పుడు పిల్లల ఫోన్ల కోసం ఎదురుచూడడం, వాళ్లతో మాట్లాడినంత సేపూ సంతోషపడి పోవడం, ఫోన్ పెట్టేసిన తరువాత వాళ్లు మాట్లాడిన టాపిక్ మీద చర్చలు...అంతే అయిపోతుంది. నిరాశా, నిస్పృహ. తిరిగి మళ్లీ పిల్లల ఫోను కోసం ఎదురు చూపులు. జీవితం ఇంత నిస్సారంగా గడిచిపోతుంటే విసుగ్గా ఉంటుంది శాంతీ. దీనికి పరిష్కారం ఏదో ఒకటి ఆలోచించాలి. మన చివరి రోజులు సంతోషంగా గడపడానికి ఏదో ఓ ఉపాయం నువ్వే చెప్పాలి శాంతీ.

నీకు మంచి మంచి ఆలోచనలు వస్తుంటాయి. నీ మెదడుకు మంచి 'మేత' ఇస్తున్నాను. వారం తిరిగే సరికి నీ సలహాతో లెటరు వ్రాయాలి.

శాంతీ, నువ్వు ఎప్పుడూ ధైర్యంగా ఉంటూ మా అందరికీ సలహాలు ఇచ్చేదానివి. ఎవరన్నా బేలగా ఉంటే ధైర్యం చెప్పేదానివి. అటువంటి నువ్వు ఈ మధ్య చాలా డీలాపడిపోయావు. నీకు గుట్టు ఎక్కువ. బాధను ఎవరితోనూ పంచుకోవడానికి ఒప్పుకోవు. నీలోనూ మార్పు రావాలి శాంతీ.

రాజేష్, గిరీష్ ఎట్లా ఉన్నారు? ఈమధ్య ఫోన్లు వచ్చాయా? గిరీష్ భార్య డెలివరీ డేట్ ఎప్పుడు? నీకు వీసా వచ్చిందా? ఈ మధ్య మన రాజ్యలక్ష్మి

కన్పించిందా?

శాంతీ, నువ్వు చెప్పే పరిష్కారం నాకూ, నీకూ మన మిత్ర బృందానికి అందరికీ ఆనందం కలిగించేది అయి ఉండాలి. నీకు లెటరు వ్రాయడం ఇంకా పూర్తి కాకుండానే అన్నయ్యగారు వాకింగ్ నుండి తిరిగి వచ్చేశారు. ఆయనకు మజ్జిగ కలిపి ఇవ్వాలి. ఇక ఉండనా మరి. నీ ఆరోగ్యం జాగ్రత్త. నీ లెటరు కోసం ఎదురుచూస్తూ...

నీ

శోభ.

★★★

కాకినాడ,

15-1-2006

ప్రియనేస్తం శోభకు-

శాంతి ప్రేమతో వ్రాయునది.

నీ లెటరు అంది వారం రోజులయినా ఎందుకు వెంటనే రిప్లై రాయలేదంటే, కారణం నువ్విచ్చిన 'మెదడుకి మేత'. నిజం చెప్పాలంటే నీ లెటరు రాకముందే నాలో అస్తవ్యస్తమైన ఆలోచనలు. నీ లెటరు చదివిన తరువాత వాటికో రూపం వచ్చిందనే చెప్పాలి.

శోభా..! ఈ ప్లాన్ నీకు నచ్చితే అన్నయ్యగార్కి చెప్పు. ఇది చదివిన వెంటనే ''ఇదంతా జరిగే పని కాదు'' అని నీకన్పించవచ్చు. నెమ్మదిగా ఆలోచిస్తే ''ఫరవాలేదు. అమలుపర్చవచ్చు'' అన్పిస్తుంది. శోభా, ఇది నిజంగా జరిగితే తిరిగి మళ్లీ మన బాల్యంలో ఉన్నట్లు 'చిలో పాలో'మంటూ కేరింతలు కొట్టవచ్చు. ఒకే డైనింగ్ టేబుల్ దగ్గర పెద్ద ఉమ్మడి కుటుంబంలా కబుర్లు చెప్పుకొంటూ భోజనం చెయ్యవచ్చు. మనం ఆనందంగా ఉంటూ నలుగురికి ఉపాధి కల్పించవచ్చు. నా ప్లాన్ వివరిస్తాను.

మన బిల్డింగ్ పేరు 'ఎన్.ఆర్.ఐ. తల్లిదండ్రుల ఉమ్మడి లోగిలి'. ఇది ఎంత స్థలంలో కడితే బాగుంటుంది అనేది మనం తరువాత ప్లాన్ చేసుకొందాం. ఈ లోగిలిలో కనీసం పది బెడ్‌రూమ్స్ ఉండాలి. అవి మరీ విశాలంగా అక్కర్లేదు. ఎటాచ్డ్ బాత్‌రూమ్స్ ఉండాలి. ఇవి హోటల్ రూమ్స్ మాదిరిగా ఎదురూ బదురూగా ఉండి మధ్య కారిడార్ ఉంటే బాగుంటుంది. ప్రతీ రూమ్‌లోనూ డబుల్ కాట్ ఉండాలి. ఇది ఫస్ట్‌ఫ్లోర్‌లో. గ్రౌండ్ ఫ్లోర్‌లో విశాలమైన హాలు, డైనింగ్ హాల్, కిచెన్, ప్రార్థనామందిరం, చిన్న లైబ్రరీ ఉండాలి. ఒక కుక్‌ని పెట్టుకొంటాం. అందరం కలిసి డైట్ చార్ట్ తయారుచేస్తాం. ఈ చార్ట్‌లో అందరి ఇష్టాలకూ ప్రాధాన్యత ఉంటుంది. షుగర్ పేషంట్స్‌కి, బి.పి.పేషంట్స్‌కి అనుకూలంగా ఉంటుంది. తరువాత ఒక వేన్, అది నడపడానికి ఒక డ్రైవర్. అతడే మనకి కావల్సినవి బయట నుండి తేవడం, మనం ఎక్కడికన్నా వెళ్లాలంటే తీసుకు వెళ్లడం చేస్తాడు. వీటన్నిటికన్నా ముఖ్యమైనది ఒక డాక్టర్‌ని ఎపాయింట్ చేసుకోవాలి. వారం రోజులకు ఒకసారి అందరికీ రెగ్యులర్ చెకప్ చెయ్యాలి. ఇంచుమించుగా అందరమూ అరవయ్యో పడిలో ఉన్నవాళ్లం కదా. ఏదో ఓ అనారోగ్యం చెప్పా పెట్టకుండా వస్తుంది. అట్లా వచ్చినప్పుడు 'యమర్జెన్సీ'కి ఆ డాక్టర్ ద్వారానే వెళ్తాం. ఒక దోబీని పెట్టుకోవచ్చు. ఓపిక ఉంటే బట్టలు ఉతుక్కోవచ్చు. అయినా అంత ఓపిక ఎవరికుంటుందిలే.

## ప్చ్! నమిత

**నమితకి తెలుగులో కెరీర్ బ్రహ్మాండంగానే మొదలైంది. జెమిని, సొంతం లాంటి సినిమాల్లో నటించిన తర్వాత ఒక రాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి సినిమా సక్సెస్ అయినా కూడా క్రమంగా బాగా లావు కావడం, ఆమె సినిమాలు ఫ్లాప్ కావడంతో తమిళంలోకి అడుగుపెట్టింది. అక్కడ కూడా ప్రారంభంలో మంచి ఆదరణే లభించినా ఇప్పుడు కెరీర్ ఏమంత ఆశాజనకంగా లేదని చెన్నయ్ సినీ సమాచారం. తాజాగా తెలుగులో 'నాయకుడు' కూడా పరాజయం చవిచూసింది. బహుశా బాక్టు పెవిలియన్‌లా ముంబాయికి చేరి అక్కడ బాలీవుడ్‌లో అవకాశాలు ట్రయ్ చేస్తుందేమో!**



శోభా, మన సర్కిల్‌లో నాలుగయిదు ఫామిలీస్ పిల్లలు యు.ఎస్.లో స్థిరపడ్డారు. ఫైనాన్షియల్‌గా ఫరవాలేదు. మిగిలిన ఫ్రెండ్స్‌కి తెలియపరుద్దాం. ఇంట్రస్ట్ ఉన్నవాళ్లు ఈ ప్లాన్‌కి ఒప్పుకొంటారు.

ఈ'కల' నెరవేరితే చాలా బాగుంటుంది శోభా. చక్కగా ఉదయమే లేచి అందరం కలిసి వాకింగ్ చేస్తాం. అందరం కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసి, న్యూస్‌పేపర్లు చదివి ఆ విషయాల గురించి చర్చించుకొంటాం. ఇంక అందరం కలిసి భోజనం చేస్తూ ఆనందంగా గడిపేస్తాం. ఇదంతా తల్చుకొంటుంటేనే ఒళ్లు పులకరిస్తుంది. అప్పుడు మనం, మన పిల్లల ఫోన్ల కోసం ఎదురుచూపులు చూడడం ఉండదు. ఈ ఉమ్మడి లోగిలిలో అందరూ సంతోషంగా గడపాలి. నీ లెటరు ఎప్పుడు వస్తుందా? అది నెగటివా? పాజిటివా? అంటూ ఎదురుచూడడం నా పని. నీ లెటరు చూసిన తరువాత శ్యామల దగ్గరకు, రాజ్యలక్ష్మి దగ్గరకు వెళ్తాను. ఇంకా అన్నయ్యగారి ఫ్రెండ్స్ ఎవరన్నా ఉంటే చూడండి. కనీసం పది ఫామిలీస్ అయితే సందడిగా ఉంటుంది కదూ.

ప్రస్తుతం నేను అన్నీ మర్చిపోయి 'ఉమ్మడి లోగిలి' కలలో మునిగిపోయాను. నాలా ఒంటరిగా ఉన్నవాళ్లకు ఈ ప్లాన్ ఇంకా నచ్చుతుంది. ఉంటాను మరి.

నీ

శాంతి

కొత్త సంవత్సరంలో కొత్త ఆలోచనలకు రూపునివ్వాలి.

★★★

బెంగుళూరు,

20-1-2006

ప్రియనేస్తం శాంతీ,

నీ లెటరు చదివిన వెంటనే కలల్లో మునిగి తేలిపోయాను. మీ అన్నయ్యగార్కి, నాకు ఈ ప్లాన్ చాలా బాగా నచ్చింది. నిజంగా నీ బుర్రే బుర్ర. చిన్నప్పుడు ఏడ్పించే వాళ్లంకాని ఇటువంటి 'ఉమ్మడి